సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 5 । డిసెంబర్ । 2024


మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, విప్‌లు ఆది, అడ్లూరి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, సత్యనారాయణ

సీఎం టూర్ సాగిందిలా..

సాయంత్రం 4.20: కలెక్టరేట్ ఆవరణలో సీఎం హెలికాప్టర్ ల్యాండ్
4.23: కలెక్టరేట్ నుంచి సభాస్థలికి సీఎం, మంత్రులు, అధికారుల రాక
4.29 నుంచి 4.59: సభలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన
4.55: జ్యోతి ప్రజ్వలన, రాష్ట్ర గీతం ఆలాపన
6.21: ఉద్యోగులకు నియామకపత్రాల అందజేత, ఎంవోయూలు, సీఎం కప్, బ్రోచర్స్ ఆవిష్కరణ
6.42: వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు
6.45 నుంచి 7.33: సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్ అనంతరం తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

సభ సైడ్‌లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి సభకు వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతున్న పెద్దపల్లి పట్టణానికి చెందిన తిరుపతిని కారు ఢీ కొట్టింది. అప్రమత్తమైన పోలీసులు ప్రాథమిక చికిత్స చేసి, అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- సభకు వచ్చిన కార్యకర్తలు, ప్రజలను పోలీసులు తనిఖీ చేశారు. పెన్నులు, అంబర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- సీఎం మాట్లాడుతున్న సమయంలో సభ సమీపంలో పలువురు ఆర్టీసీ బస్సుల పైన నిల్చొని ప్రసంగం విన్నారు.
- సీఎం సభకు లక్ష మందికి పైగా ప్రజలు వచ్చినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు చెబుతున్నారు.


సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

'యువ వికాసం'.. జన ప్రవాహం

- సోనియాగాంధీ హామీ మేరకు తెలంగాణ ఏర్పాటైంది..
- ఉమ్మడి కరీంనగర్‌కు రూ.1,024 కోట్లు మంజూరు చేశాం
- పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తాం
- రామగుండానికి విమానాశ్రయం, మంథనికి కోకాకోలా ఫ్యాక్టరీ తెప్పిస్తాం
- తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- పెద్దపల్లి యువ వికాసం విజయోత్సవ సభ సక్సెస్

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ గడ్డ నుంచే సోనియా గాంధీ 2004లో తెలంగాణ పోరాటాన్ని, అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తిస్తున్నామని ప్రకటించి, తెలంగాణ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లాకు నిధులిచ్చే బాధ్యత నాదేనని.. సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవల్లో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రూ.1,024 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, శాతవాహన విశ్వవిద్యాలయానికి లా కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తామని, రామగుండానికి విమానాశ్రయం, మంథనికి కోకాకోలా ఫ్యాక్టరీ తెప్పిస్తామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మించి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

స్టాల్స్ పరిశీలన..

సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ గరుడ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, డీఈఈటీ, ఏఎల్ఈఏపీ, టాస్క్, ఎన్ఎస్ఐసీ, న్యాక్, టామ్ కామ్, యువజన క్రీడా శాఖ, సింగరేణి ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పరిశీలించారు.

నియామక పత్రాలు.. ప్రారంభోత్సవాలు

17 మంది అభ్యర్థులకు సీఎం, మంత్రులు నియామక పత్రాలు అందజేశారు. 8 పరిశ్రమలతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ. డీఈఈటీ లాంచ్. సీఎం కప్–2024 బ్రోచర్, రియల్ టైం లైవ్ వీడియోల యూట్యూబ్ చానల్, జెర్సీ, కప్ ఆవిష్కరణ. రూ.1,024.90 కోట్లతో రోడ్ల నిర్మాణ, పెద్దపల్లి మున్సిపాలిటీ భవనం, పెద్దపల్లి ఆస్పత్రి 100 పడకల అప్‌గ్రెడేషన్, రామగుండం నర్సింగ్ కళాశాల, గుంజపడుగులో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంథనిలో నూతనంగా 50 పడకల ఆస్పత్రి, పెద్దపల్లిలో సబ్‌స్టేషన్, పెద్దపల్లి, రామగుండంలలో యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు, పెద్దపల్లిలో బాలికల జూనియర్ కళాశాల, శ్రీరాంపూర్ కేజీబీవీ అభివృద్ధి, గోదావరిఖని పీజీ కళాశాల అకాడమిక్ బ్లాక్ పనులు, రామగిరి ఖిల్లా, మంథని టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి, పెద్దపల్లి ట్రాఫిక్, మహిళా, రూరల్, ఎలిగేడు పోలీస్ స్టేషన్లు, పెద్దపల్లి బస్ డిపో పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

నేతలు ఏమన్నారంటే...

- ఆర్అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రూ.710 కోట్లు మంజూరు చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు.
- రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు సూచించారు.
- గత ప్రభుత్వం మాటల ప్రభుత్వం, తమది చేతల ప్రభుత్వమని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.
- గతంలో రైతు రుణాలను సోనియాగాంధీ పూర్తిస్థాయిలో మాఫీ చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు మాఫీ చేశారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు.
- రామగుండానికి ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు తీసుకువచ్చి, యువతకు ఉపాధి కల్పిస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.
- ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు, గోదావరి నదీ ప్రక్షాళనకు రూ.17 కోట్లు మంజూరు చేయాలని విప్ లక్ష్మణ్‌కుమార్ కోరారు.
- రామగుండంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సీఎం, మంత్రులను కోరారు.

పని చేయడానికి వచ్చాం



సింగరేణి కార్మికులకు గతంలో ఎన్నడూ లేని విధంగా కోటి రూపాయల ప్రమాద బీమా అందించాం. గత ప్రభుత్వం మాదిరిగా మేము ప్రచారం చేసుకోవడానికి కాదు పని చేయడానికి అధికారంలోకి వచ్చాం. జైపూర్‌లో విద్యుత్ ప్లాంట్ స్టేజ్–2 పనులకు టెండర్ పిలిచాం. రామగుండంలో కొత్త పవర్ ప్లాంట్‌కు త్వరలో భూమిపూజ చేస్తాం.

– మల్లు భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

'పత్తిపాక'కు డీపీఆర్



పాలకుర్తి ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం లేకుండానే 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చింది. రైతులు తెలంగాణ సోనా, బీపీటీ రకాలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి

రింగ్‌రోడ్డు నిర్మిస్తాం



మంథని పట్టణంలోని శ్రీపాద్ మార్గ్ నుంచి మంథని పట్టణానికి రూ.162 కోట్లతో 4 లేన్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇచ్చాం. సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి ఇళ్ల స్కీం, పన్నుల విషయంలో న్యాయం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

ధర్మపురి, కొండగట్టు అభివృద్ధికి చర్యలు



ధర్మపురి, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గతంతో పోలిస్తే మెరుగ్గా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత మా అందరిపై ఉంది.

– పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి

'ఇందిరమ్మ' యాప్ ప్రారంభిస్తున్నాం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరం గురువారం ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభిస్తున్నాం. శుక్రవారం నుంచి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ధరణి రికార్డుల నిర్వహణను ఎన్ఐసీకి అప్పగించాం.

– పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

సంతోషంగా ఉంది



పెద్దపల్లికి రూ.461 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. జిల్లా కేంద్రంలో బస్ డిపో ఏర్పాటవుతుండటం సంతోషంగా ఉంది.

– చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి


సీఎంకు ఓదెల మల్లన్న చిత్రపటం బహూకరణ


స్టాల్ వద్ద యువతులతో సీఎం కరచాలనం



డిజిటల్ ఎంప్లాయిమెంట్ యాప్ ప్రారంభిస్తూ..


వివిధ కంపెనీల ప్రతినిధులతో ఎంవోయూ..


సభకు వెళ్తున్న వారిని తనిఖీ చేస్తున్న సిబ్బంది


సీఎంకు బొకే అందిస్తున్న 'అల్ఫోర్స్' నరేందర్‌రెడ్డి


కళాకారుల ఆటాపాట


పోలీసుల బందోబస్తు


ఒగ్గుడోలు కళాకారుల విన్యాసం


బస్సుల పైనుంచి చూస్తున్న యువకులు


బోనాలతో మహిళల కోలాట ప్రదర్శన


నృత్యం చేస్తున్న గుస్సాడీ కళాకారులు

న్యూస్‌రీల్

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



వేములవాడ: గత 75 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తూనే ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ విమర్శించారు. స్థానిక భీమేశ్వరగార్డెన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది క్రితం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతుభరోసా అందలేదని, 4 లక్షల ఇంగిరమ్మ ఇళ్ల ప్రస్తావనే లేదన్నారు. రానున్న రోజుల్లో ఆరు అబద్ధాలు, 66 గ్యారంటీలపై ప్రజల ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. గోపు బాలరాజు, నామాల శేఖర్, సగ్గు రాహుల్, పరమేశ్, రాకేశ్, మంద రాజేందర్ పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించండి



సిరిసిల్లటౌన్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం చేపట్టిన మహాధర్నాలో మాట్లాడారు. ప్రభుత్వం ఏడాదిగా సమస్యలు పరిష్కరించడంలో తాత్సారం చే స్తుందన్నారు. రూ.18వేలు వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నాయకులు బాధవేణి మంజుల, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, గురిజాల శ్రీధర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

30న తుది ఓటరు జాబితా

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్



వేములవాడఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు తుది జాబితా ఈనెల 30న ప్రకటించనున్నట్లు వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఓటరు నమోదు గడువు ఈనెల 9న ముగియనుందని, అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 ద్వారా ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. పొలాస నరేందర్, అన్నారపు శ్రీనివాస్, పిన్నింటి హన్మండ్లు, రామస్వామి తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు గుర్తించేందుకే న్యాస్

- డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి



బోయినపల్లి(చొప్పదండి): విద్యాప్రమాణాలు గుర్తించి వాటికి అనుగుణంగా బోధనలో మార్పులు, నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు నైపుణ్యాభివృద్ధి మెరుగు కోసం న్యాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ హైస్కూల్‌లో న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష సెంటర్‌ను బుధవారం సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 85 పాఠశాలల్లో 95 శాంపిల్ తరగతులను తీసుకుని విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడం జరిగిందన్నారు. ఎంఈవో శ్రవణ్‌కుమార్, కరస్పాండెంట్ బిల్ల ఆనందం, అబ్బర్వర్, బాలరాజు ఉపాధ్యాయులు ఉన్నారు.

కుటుంబ నియంత్రణ వారోత్సవాలు విజయవంతం

వేములవాడఅర్బన్: కుటుంబ నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా వేములవాడ ఏరియా ఆస్పత్రిలో 153 ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి వసంతరావు ఆధ్వర్యంలో పురుషులకు కోత, కుట్లు లేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు.

కంపించిన భూమి

- మూడు సెకన్లపాటు కంపనాలు
- భయాందోళన చెందిన ప్రజలు
- బయటకు పరుగులు తీసిన వైనం

వేములవాడ/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/బోయినపల్లి: భూకంప ప్రకంపనలతో జిల్లా ప్రజలు భయాందోళన చెందారు. బుధవారం ఉదయం 7.28గంటలకు దాదాపు మూడు సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. కుర్చీలో కూర్చున్న వారికి తలతిరిగినట్లు అనిపించిందని, బకెట్లోని నీళ్లు అటు, ఇటు కదిలినట్లు కనిపించిందని పలువురు పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో గజ్జల రాజశేఖర్‌గౌడ్ మంచం ఊగినట్లు అనిపించిందని కొడుకుతో చెప్పగా.. తాను కూర్చున్న కుర్చీ కూడా ఊగుతుందని పైకి లేచి కూర్చున్నట్లు తెలిపారు. రేకులషెడ్లు కంపించడంతో ఏం జరుగుతుందో తెలియక గ్రామీణులు బయటకు పరుగులు తీశారు. కిషన్‌దాస్‌పేటలోని ఓ ఉపాధ్యాయుడు టీవీ చూస్తుండగా ఇంట్లోని పీట కదలినట్లు కనిపించిందని తెలిపారు.

బయటకు పరుగులు తీశాం..



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఒక్కసారిగా భూమి కంపించింది. కూరగాయలు అమ్ముతున్న నేను దుకాణం నుంచి బయటకు వచ్చాను. కూరగాయాలు కొంటున్న వారు కూడా ఆందోళన చెందారు.

– శంకర్, కూరగాయల వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

వంటపాత్రలు కదిలాయి



వంటపాత్రలు కదిలాయి. ఫ్రిడ్జ్‌పై ఉన్న వస్తువులు సైతం కదిలినట్లు కనిపించాయి. బయటకు వచ్చి చూస్తే పక్కింటి వాళ్లు కూడా బయటకు రావడం కనిపించింది. ఏం జరుగుతుందో తెలియక భయపడ్డాం.

– బద్దం ఎల్లారెడ్డి, గాలిపెల్లి, ఇల్లంతకుంట

భయాందోళనకు గురయ్యాం



ఎల్లారెడ్డిరెడ్డిపేటలో బుధవారం స్వల్ప భూకంపంతో భయాందోళనకు గురయ్యాం. ఆ సమయంలో శరీరమంతా ఏదో విధంగా ఐపోయింది. భూకంపం ఎఫెక్ట్ నుంచి తేరుకోవడానికి రెండు గంటలు పట్టింది. – బాలయ్య, స్వీపర్, నారాయణపూర్

మంచం కదలడంతో లేచాను



సాంచెల కాడ ఎక్కువ పని లేకపోవడంతో కొంత ఆలస్యంగా లేద్దామని పడుకున్న. ఒక్కసారిగా మంచం కదిలినట్లు అనిపించడంతో లేచి కూర్చున్న. అంతా అయోమయంగా అనిపించింది.

– సిరిపురం పవన్, నేతకార్మికుడు, బోయినపల్లి

ఏటీసీతో ఉపాధి అవకాశాలు మెరుగు


కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.42కోట్లతో ఏర్పాటు చేసే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన సముదాయం కోసం బుధవారం స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి పరిశీలించారు. రుద్రంగిలోని కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్లేగ్రౌండ్ సరిగ్గా లేదని విద్యార్థులు తెలుపగా.. వెంటనే ఆట స్థలాన్ని చదును చేయించాలని రుద్రంగి ఎంపీడీవో నటరాజ్‌ను ఆదేశించారు. కేజీబీవీ ఆవరణలో దుర్వాసన వస్తుండడంతో కమ్యూనిటీ సోక్ ఫిట్‌లు నిర్మించాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వభూమి అన్యాక్రాంతం అవుతుండడంపై తహసీల్దార్ శ్రీలతపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ పాడయిన ఆలుగడ్డలు వినియోగిస్తుండడం, మెనూ పాటించకపోవడంపై ఎస్‌వో మంకు వనితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీలత, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలంలోని తాట్లవాయికి చెందిన దడికొప్పుల రాములు(55) అనే ఉపాధిహామీ కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాములు బుధవారం తాట్లవాయి గ్రామంలోని నర్సరీలో పని చేస్తున్నాడు. ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలాడు. తోటి కూలీలు 108కు సమాచారం అందించారు. కానీ, సిబ్బంది వచ్చేలోపే అతను చనిపోయాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

రుద్రంగి/చందుర్తి(వేములవాడ): భూమి పట్టా చేస్తానని డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడిన రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గుగ్గిళ్ల తిరుపతిపై కేసు నమోదైంది. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన శీలం పద్మ, శీలం హనుమక్క మధ్య వారసత్వంగా వచ్చిన భూమి వివాదంలో ఉంది. ఈ వివాదంలో గుగ్గిళ్ల తిరుపతి పెద్ద మనిషిగా వ్యవహరిస్తూ భూమి పట్టా చేస్తానని పద్మ వద్ద పలుమార్లు డబ్బులు వసూలు చేశాడు. ఇంకా రూ.లక్ష ఇస్తేనే పట్టా చేయిస్తానని, లేకుంటే భూమి దక్కకుండా చేస్తానని బెదిరించాడు. పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్.. మహిళ అరెస్ట్

వేములవాడ: రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న తంగళ్లపల్లి మండలం నరసింహులపల్లికి చెందిన గొడిశెల పద్మను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాలు.. వేములవాడ అర్బన్ మండలం తెట్టెకుంట గ్రామానికి చెందిన సయ్యద్ హైదర్ మారుపాకకు చెందిన కొట్టె శివయ్య వద్ద 1980లో తెట్టెకుంట శివారులో 14 గుంటల భూమి కొనుగోలు చేశాడు. హైదర్ పదేళ్ల క్రితం మరణించగా, అప్పటి నుంచి సదరు భూమి కబ్జాలో అతడి కుటుంబ సభ్యులే ఉన్నారు. కాగా, అప్పట్లో అతడి కుటుంబ సభ్యులు తమ పేరిట భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకోలేదు. ఇటీవల రెవెన్యూ రికార్డులలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు వెళ్లగా, సదరు భూమి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పద్మ పేరిట రిజిస్ట్రేషన్ అయింది. దీంతో హైదర్ కుమారుడు సయ్యద్ బాషా వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం పద్మను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ధర్నా చేసిన మహిళలపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌లో ధర్నా రాస్తారోకో చేసిన మహిళలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఐకేపీకి చెందిన స్థలం విషయంలో మహిళలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ధర్నా చేపట్టారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై బైటాయించి, ధర్నాచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోతుగల్‌లో పలువురిపై..

మండలంలోని పోతుగల్‌లో ఇటుక ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటనలో చేపూరి కైలాస్‌గౌడ్ మృతిచెందగా.. మృతదేహాన్ని తరలించే విషయంలో ఆందోళన చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ పోలీసులకు సహకరించని వ్యక్తులపై కేసులు పెట్టినట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభం

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఆడిటోరియంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను వీసీ ఉమేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుంటుపడుతున్న పల్లె పాలన

- పని ఒత్తిడిలో ప్రత్యేకాధికారులు
- పది నెలలుగా అదనపు విధులు
- పనుల్లో అలసత్వం



ఈ ఫొటోలో మురుగు కాల్వ ఇబ్బందులు వెళ్లబోసుకుంటున్న ఈ కుటుంబం పోతుగల్ గ్రామానికి చెందినవారు. వంగపల్లి ముత్తయ్య, మల్లవ్వ, కవిత, శ్రీనివాస్‌ల ఇంటి ఎదుట ఏడాదిగా మురుగుకాల్వ సమస్య ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించగా, పది ఇళ్లకు చెందిన మురుగు నీరు చేరడంతో అది సరిపోవడం లేదు. దీంతో ఇలా ముత్తయ్య ఇంటి ఎదుట మురికికూపంగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సదరు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దోమలు, దుర్వాసనతో జ్వరాలబారిన పడుతున్నామని వాపోయారు. కార్యదర్శికి, ప్రత్యేకాధికారులకు విన్నవించినా మురుగు కాలువ నిర్మించడం లేదని పేర్కొన్నారు. అయితే ఇక్కడ ఎంపీడీవో ప్రత్యేకాధికారిగా ఉన్నారు. పోతుగల్, గన్నెవారిపల్లె ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో కొనసాగుతున్నారు. దీంతో సదరు అధికారి ఎప్పుడు బీజీగా ఉండడంతో గ్రామాలపై దృష్టి పెట్టడం లేదు. ఇలా ఒక్క పోతుగల్ గ్రామంలోనే జిల్లా అంతటా అభివృద్ధితోపాటు ఇతర పనులలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి'.



పోతుగల్ గ్రామ పంచాయతీ

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనకు పది నెలలైంది. కాగా.. పంచాయతీల్లో సకాలంలో పారిశుధ్య సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం జనవరి 31తో ముగిసిన సంగతి విదితమే. స్థానిక సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఒకవైపు శాఖాపరమైన విధులతోపాటు పంచాయతీలు, మండల ప్రత్యేకాధికారులుగా అధికారులు పనిచేస్తున్నారు. దీంతో పల్లెల్లో పాలన పడకేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

'ప్రత్యేకం'తో ఇబ్బందులు

ప్రత్యేకాధికారులకు పాలన బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. గ్రామసభలు, తీర్మానాలు, వేతనాల చెల్లింపులతోపాటు అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులలో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీలకు వచ్చేందుకు ప్రత్యేకాధికారులు ముఖం చాటేశారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామసభలు, వేతనాల చెల్లింపులతోపాటు అభివృద్ధి పనుల బిల్లుల విషయంలో ప్రత్యేకాధికారులు సంతకాలు చేయడం లేదు. కొన్ని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయం, తీరిక లేకపోవడంతో బిల్లుల చెల్లింపులకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో పనులు పారదర్శకంగా జరుగుతుండగా.. అంతటా అవే పరిస్థితులు లేవని ప్రత్యేకాధికారులు భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో స్ట్రిక్ట్‌గా సమీక్షలు చేస్తుండడంతో చెక్‌లపై సంతకాలు చేయడం లేదు. పనులు ఎంబీ రికార్డు అయి ఉండి, నిధులు సిద్ధంగా ఉంటే చెల్లింపులు చేయాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు. దీనిపై అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

నిధుల కేటాయింపుపై ప్రభావం

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులకు కోత పడుతుంది. ముఖ్యంగా ప్రణాళిక సంఘం నిధులతోపాటు ఉపాధిహామీ పనులపై ప్రభావం చూపుతోంది. జిల్లా స్థాయిలోనూ సమస్యలు ఉన్నాయి. జిల్లా పరిషత్‌కు ఇన్‌చార్జిగా కలెక్టర్, డీఆర్‌డీవో శేషాద్రి డీపీవోగా, డీఆర్‌డీఏగా అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు జిల్లా స్థాయి అధికారులు 13 మండలాలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర మండల స్థాయి అధికారులు పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు.

పనులు జరగడం లేదు



మా ఇంటి ముందు నుంచి మురుగు కాల్వ నిర్మించాలని పంచాయతీలో తీర్మానం చేశారు. మోరీ పనులు కొంత మంది అడ్డుకున్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది పనులు నిలిపివేశారు. ప్రత్యేకాధికారి దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. ఆయన ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియదు.

– వంగపల్లి ముత్తయ్య, పోతుగల్

సమస్యల పరిష్కారానికి కృషి



మండలాలు, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు కృషి చేస్తున్నాం. ఎక్కడైన నిధులు లేకపోతేనే బిల్లులు ఆగుతున్నాయి. ప్రత్యేకాధికారులు వీలున్న సమయంలో గ్రామాలను సందర్శిస్తున్నారు. వారిపై కూడా పని ఒత్తిడి ఉంది. సర్వే, ధాన్యం సేకరణ వంటి విషయాల్లో బిజీగా ఉన్నారు.

– శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

- మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కరుణాకర్
- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



సిరిసిల్లలో మాజీ సర్పంచుల ర్యాలీ

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని మాజీ సర్పంచుల ఫోరం కన్వీనర్ అక్కెనపల్లి కరుణాకర్ విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం పాదయాత్ర చేపట్టి మాట్లాడారు. ప్రజాపాలనకు ఏడాది గడిచిందని సంబరాలు చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యలపై స్పందించకపోవడం సరికాదన్నారు. ఏడాదిగా రాష్ట్రంలో సర్పంచుల బాధలు ఎందుకు పట్టించుకుంటలేరని ప్రశ్నించారు. ఇప్పటికే మీరిచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ జరిగి పేద, దళిత పిల్లలు దాదాపుగా 50 మంది వరకు చనిపోతే కనీసం వారిని పట్టించుకునే పరిస్థితితో ఈ ప్రభుత్వం లేదన్నారు. ఈనెల 9న నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లోనైనా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులపై చర్చించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గనుప శివజ్యోతి, గౌరవ సలహాదారులు చాకలి రమేశ్, బొజ్జం మల్లేశం, ఖేందె గంగాధర్, మల్యాల దేవయ్య, జిల్లా కార్యదర్శి కోల నర్సయ్య, గున్నాల లక్ష్మణ్, చల్ల నారాయణ, సంయుక్త కార్యదర్శి గాండ్ల సుమతి, సిరికొండ శ్రీనివాస్, తాడేపు ఎల్లం, దోమకొండ ఎల్లం, ఏనుగుల కేశవరావు, మంతెన సంతోష్‌రెడ్డి, నారే మహేందర్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, యజమాని, డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పోతుగల్ నక్కవాగు నుంచి ఇసుకను అక్రమ తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పట్టుకుని ఠాణాకు తరలించామన్నారు. ట్రాక్టర్ యజమాని సేవాలాల్‌తండాకు చెందిన లకావత్ అరుణ్, పోతుగల్ తండాకు చెందిన రమావత్ రాజు డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.

వారబందీ పద్ధతిలో సాగునీరు

తిమ్మాపూర్: దిగువ మానేరు జలాశయం ద్వారా యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సాగునీరు అందిస్తామని ఎస్సారెస్పీ ఈఎన్‌సీ శంకర్ తెలిపారు. ఎల్‌ఎండీలోని సీఈ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్‌ఎండీలో 23.735 టీఎంసీలు, శ్రీరాజరాజేశ్వర(ఎంఎంఆర్)లో 26.73 టీఎంసీల నీరు ఉందన్నారు. మిషన్ భగీరథ, తాగునీటి అవసరాలు పోనూ రెండు ప్రాజెక్టుల నుంచి 25 టీఎంసీలు, ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి 5 టీఎంసీలు మొత్తం 30 టీఎంసీలు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా జనవరి 1నుంచి సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియ మార్చి 31వరకు 90రోజులు కొనసాగుతుందని వెల్లడించారు. స్టేజ్1 మహబూబాబాద్ వరకు 8 రోజులు, అక్కడి నుంచి సూర్యాపేట వరకు 7 రోజులు నీటిని వదలనున్నట్లు తెలిపారు. కాలువ కింద మొత్తం పంటలకు 60 టీఎంసీలు కావాల్సి ఉండగా.. ఆన్ ఆఫ్ పద్ధతిలో 30 టీఎంసీలతోనే సరిపెట్టనున్నట్లు వివరించారు.

వాహనాల దారి మళ్లింపుతో ఇబ్బంది

- మొగ్ధుంపూర్ వద్ద ట్రాఫిక్‌జామ్



మొగ్ధుంపూర్ స్టేజీ వద్ద నిలిచిన వాహనాలు

కరీంనగర్‌రూరల్: పెద్దపల్లిలో బుధవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ సందర్భంగా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాజీవ్‌రహదారిలోని మొగ్ధుంపూర్ స్టేజి వద్ద కరీంనగర్‌రూరల్ పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు, కార్లు ఇతర వాహనాలను పెద్దపల్లి వైపు వెళ్లకుండా మొగ్ధుంపూర్ స్టేజి నుంచి చెర్లభూత్కూర్ మీదుగా నగునూరు వద్ద చొప్పదండి రహదారిలోకి మళ్లించారు. ఉదయం 9 గంటల నుంచే ఇలా చేయడంతో గర్రెపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి తదితర ప్రాంతాలకు ఉద్యోగం, వ్యాపార పనుల నిమిత్తం వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం 4 గంటలకు సీఎం మీటింగ్ ఉంటే ఇప్పటి నుంచి వాహనాలను ఎందుకు డైవర్ట్ చేస్తున్నారంటూ పోలీసులతో పలువురు వాగ్వాదానికి దిగారు. దీంతో పెద్దపల్లి వైపు వెళ్లాల్సిన కార్లు, ఆటోలను కాసేపు వదిలేశారు. అయితే, చెర్లభూత్కూర్ నుంచి కరీంనగర్‌కు సైతం భారీ వాహనాలు వస్తుండటంతో మొగ్ధుంపూర్ స్టేజి వద్ద పలుమార్లు ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సాయంత్రం సీఎం సభ ముగిశాక రాకపోకలు యథావిధిగా సాగాయి.

బస్టాండ్‌లో రూ.10వేలు చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్‌లో బుధవారం బస్సుకోసం నిరీక్షిస్తున్న ఓ ప్రయాణికుడి జేబు నుంచి రూ.10 వేలు దొంగిలిస్తూ మంచిర్యాలలోని సున్నంబట్టి ప్రాంతానికి చెందిన బాలుడు పట్టుబడ్డాడు. వివరాలు.. గమ్యస్థానానికి వెళ్లేందుకు ఉన్న ప్రయాణికుడి జేబునుంచి దొంగిలించిన డబ్బును బాలుడు తన జేబులో పెట్టుకుంటుండగా కొన్ని నోట్లు కిందపడ్డాయి. వాటిని అక్కడే ఉన్న ప్రయాణికులు గమనించి నిలదీయగా డబ్బులు కిందపడితేనే తీసుకుంటున్నానని బుకాయించినట్లు ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది రమేశ్ తెలిపారు. బాలుడిని పోలీసులకు అప్పగించేందుకు అదుపులోకి తీసుకోగా అతడి బంధువొకరు అధికారులతో వాదనకు దిగాడు.

మహిళా హోంగార్డ్ రిమాండ్

వేములవాడ: వేములవాడ ఆలయంలో ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన డి.శేఖర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన మహిళా హోంగార్డు వడ్ల అనూషను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాలు.. కొద్ది రోజుల క్రితం సదరు హోంగార్డు తన భర్త ఆరోగ్యం బాగాలేదని శేఖర్ వద్ద రూ.3.50 లక్షలు అప్పు తీసుకుంది. ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని ఇవ్వలేదు. డబ్బులు అడిగితే.. తనను శేఖర్ పెళ్లి చేసుకున్నాడని తప్పుడు పెళ్లి పత్రిక, మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అసత్య ప్రచారం చేస్తూ రూ.5 లక్షలు డిమాండ్ చేయగా, పరువు పోతుందని భయపడిన శేఖర్ రూ.5 లక్షలు అనూషకు ఇచ్చాడు. మళ్లీ రూ.2 లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో విసిగిపోయిన శేఖర్ వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి అనూషపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా ఇలాగే బ్లాక్‌మెయిల్ చేస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

నలుగురికి రిమాండ్

సిరిసిల్ల క్రైం: పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద ఉన్న వ్యక్తిని బెదిరించి డబ్బులు లాక్కున్న నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. పోలీసుల వివరణ ప్రకారం... పట్టణంలోని గాంధీచౌక్ ఎస్ఆర్‌కే వైన్స్ వద్ద కొల్లమద్ది భానుప్రసాద్ మద్యం కొనేందుకు వెళ్లగా సంజీవయ్య నగర్‌కు చెందిన అలువాల ప్రశాంత్, రాకమ్ భరత్, కొండ శేఖర్, తుడిచెర్ల నిఖిల్ అతడిపై దాడిచేసి రూ.8 వేలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 2న ఫిర్యాదు కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ పుటేజీలు ఆధారంగా వారిని గుర్తించారు. వారినుంచి రూ.2వేలతోపాటు 4 సెల్‌ఫోన్లను సీజ్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు



నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు ఆరు రోజుల్లో హుండీల ద్వారా రూ.1,34,45,031 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ సీసీ కెమెరాల నిఘా మధ్య ఆలయ అధికారులు, సిబ్బంది, లలితా సేవా సమితి సభ్యులు హుండీ ఆదాయం లెక్కించారు. 173 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి, విదేశీ కరెన్సీ సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు.

బంగ్లాలో దాడులు ఆపండి



సిరిసిల్లలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ



రాజన్న ఆలయం ఎదుట నిరసన

- హిందూ ఐక్యవేదిక, ఇస్కాన్ ప్రతినిధులు
- సిరిసిల్ల, వేములవాడల్లో ర్యాలీ

సిరిసిల్లటౌన్/వేములవాడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని జిల్లా హిందూ ఐక్యవేదిక, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిరిసిల్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయం ఎదుట హిందూ ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఇస్కాన్ ప్రతినిధులు మంగళారపు ప్రభాకర్, కోడెం అశోక్, వికాస తరంగిణి, ప్రతినిధులు పత్తిపాక శ్రీనివాస్, అంజనా దేవి, గీతా ప్రచార సమితి ప్రతినిధులు జనపాల శంకరయ్య, గాయత్రి పరివార్ ప్రతినిధి బాధం ప్రకాశ్, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, వేములవాడలో గడప కిశోర్, అల్లాడి రమేశ్, రేగుల మల్లికార్జున్, శ్రీనివాస్, రమేశ్, రాహుల్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడాపోటీలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో సీఎం కప్ పోటీల నిర్వహణపై బుధవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో సీఎం కప్–2024 క్రీడోత్సవాలు ఈనెల 7 నుంచి జనవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడా మైదానాలను ఉపయోగించుకొని జిల్లాకు కేటాయించిన ఆటల పోటీలు నిర్వహిస్తూనే.. అదనంగా టేబుల్‌టెన్నిస్, క్యారం బోర్డు, తైక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్, చెస్, వుషూ పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందజేయాలన్నారు. క్రీడలు, యువజనశాఖ అధికారి రాందాస్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాటతో కాంగ్రెస్‌లో వణుకు



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లకల్చరల్: కాంగ్రెస్ పాలన మొదలైన ఏడాదిలోపే రాష్ట్రంలో 53 మంది విద్యార్థులు చనిపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవిగౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ గురుకులాల బాట కాంగ్రెస్ పార్టీలో వణుకు పుట్టిస్తోందన్నారు. విద్యార్థి వసతి గృహాల్లో పేరుకుపోయిన సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. 1500 మందికిపైగా విద్యార్థులు ఆస్పత్రి పాలైనప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. నాణ్యమైన భోజనం కోసం విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని, వసతుల కల్పన విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజనింగ్‌కు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, ముగ్దం అనిల్, ముదం సాయికుమార్, సామల శ్రీకాంత్, దేవరాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సెస్ ఉద్యోగులు సస్పెన్షన్

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్(సెస్) ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సెస్ ఎండీ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. సిరిసిల్ల టౌన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రవి, బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లెలో లైన్‌మెన్‌గా పనిచేసే కె.దేవయ్య, సిరిసిల్లటౌన్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేసే తిరుపతిలను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. సెస్‌కు సంబంధించిన విద్యుత్ లైన్ నిర్మాణం, సంస్థకు సంబంధించిన బిల్లుల విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు సంస్థాపరమైన విచారణలో తేలడంతో ముగ్గురిపై వేటు వేశారు. ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయాన్ని సెస్ ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచడం చర్చనీయాంశమైంది.

యువ వికాసానికి..

సిరిసిల్లటౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో బుధవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి 'యువవికాసం' కార్యక్రమానికి గ్రూప్–4 అభ్యర్థులు తరలివెళ్లారు. రెండు బస్సుల్లో వెళ్లారు. కలెక్టరేట్ నుంచి వెళ్లిన బస్సులకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహంగా తరలివెళ్లారు.



ఎములాడ రాజన్నకు మొక్కులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



కోడెలకు పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ: ఎములాడ రాజన్నను బుధవారం సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో పూజలు చేశారు. ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా మహారుద్ర యాగం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ రాజన్న ఆలయంలో బుధవారం స్వామివారికి మహారుద్ర యాగం, చండీహోమం, కోడె పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. ఈవో వినోద్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవస్థానంలో రూ.123కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.కోటితో బద్దిపోచమ్మ ఆలయ పునర్నిర్మాణం, రూ.25 లక్షలతో నాంపల్లి గుట్ట సమీపంలోని దేవస్థానం భూమికి ప్రహరీ నిర్మాణం, రూ.71 లక్షలతో తిప్పాపూర్ గోశాలలో సీసీరోడ్డు, మురికికాలువ, మొరం పోయడం వంటి పనులు చేస్తున్నట్లు వివరించారు. రూ.35లక్షలతో గోశాలలో షెడ్లు, విద్యుత్ సౌకర్యం, కోడెల కోసం క్వారంటైన్ షెడ్డు, రూ.50లక్షలతో జాతర గ్రౌండ్‌లోని గోశాలలో రెండు షెడ్లు, రూ.76కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ, రూ.35కోట్లతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కేంద్రం, భక్తులకు బ్రేక్ దర్శనాలు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.